## కథాకేళి

మల్లాది వెంకట కృష్ణమూర్తి

కేంపు నుంచి ఇంటికి రాగానే మా ఇంటివాళ్ళబ్బాయి చెప్పాడు మాఅక్కయ్య కొడుకు నా కోసం రెండుసార్లు వచ్చి వెళ్ళాడని. ఎందుకో చెప్పలేదు. ఏదయినా అవసరమయిన పని వుంటే కాని వాడు నా గదికి రాడు. స్నానం చేసి స్కూటర్ మీద ఆఫీసుకు వెళుతూ మా అక్కయ్య ఇంటికి వెళ్ళాను.

నా మేనల్లుడు ఆఫీసుకి వెళ్ళిపోయాడు. అక్కయ్య నన్ను చూసి ఒక్కసారిగా బావురుమనడంతో నా గుండె ఆగినంత పనయింది.

"ఏమైంది? ఏమైందే?" అడిగాను కంగారుగా.

"దొంగలు పడ్డార్రా" చెప్పింది అక్కయ్య ఏడుస్తూ.

ఆ మాట వినగానే కొద్దిగా రిలీఫ్‌గా అనిపించింది. ఎవరికీ ఏం కాలేదు నేను భయపడ్డట్లుగా.

"ఎప్పుడు?" అడిగాను.

"మొన్న తెల్లవారుఝామున"

"ఏం పోయాయి?"

"అమ్మ నాకిచ్చిన గొలుసు, వెండి కంచాలు, రెండువేల కేషు."

"అంటే పదిహేనువేలదాకా పోయిందన్నమాట."

# సరయిన భయం

"అవును. నీ కోసం వాణ్ణి పంపిస్తే నువు కేంప్ నుంచి ఇంకా రాలేదని చెప్పాడు."

"ఇందాకే వచ్చాను. ఇంటి వాళ్ళు చెప్పగానే వెంటనే ఇటొచ్చేసాను. ఎవరి మీదయినా అనుమానం వుందా?" అడిగాను.

కళ్ళు తుడుచుకుని తల వూపింది.

"ఎవరి మీద?"

"రమణయ్య"

"రమణయ్య?"

"అవును. వాడు నిన్నటి నుంచి కనపడడం లేదు" చెప్పింది అక్కయ్య.

రమణయ్య మా అక్కయ్య ఇంటి ఎదురుగా గుడిసెలో వుంటాడు. ఇళ్ళు కట్టే తాపీ మేస్త్రీ దగ్గర పని చేస్తుంటాడు. మా అక్కయ్యకి కూరలు, పాలు తెచ్చివ్వడం లాంటి పనులు చేసి పెడుతూంటాడు.

"వాడి భార్య చెప్పింది-మొన్న రాత్రి గడ్డ పార తీసుకుని బయటికి వెళ్తుంటే చూసి ఎక్కడికని అడిగితే



'పనికి' అన్నాడని. నిన్న ఉదయం నుంచి అయిపు, అజ లేదు. వేసంకాలం కాబట్టి అంతా మేడమీద పడుకుంటామని, కింద కిటికీ వూచలు వంచి లోపలకి ప్రవేశించినా ఎవరికీ తెలీదని ఒక్క రమణయ్యకే తెలుసు"

"పోలీస్ రిపోర్టు ఇవ్వలేదా?" అడిగాను.

"ఇంకా లేదు"

"ఇంకా లేదా? ఈపాటికి ఇచ్చి వుండాల్సింది"

అక్కయ్య సమ్మాధానంగా మళ్ళీ గట్టిగా ఏడవసాగింది. ఆవిడని చూస్తే జాలేసింది నాకు.

"సాయంత్రం ఆఫీస్ నించి వస్తాను. పోలీస్ స్టేషన్‌కి వెళదాం" చెప్పాను.

సాయంత్రం ఆఫీస్ నించి సరాసరి అక్కయ్య ఇంటికి వెళ్ళాను. మా అక్క కొడుకు స్కూటర్ బయట కనిపించింది. వాడూ ఆఫీస్ నించి వచ్చాడని గ్రహించాను.

"ఏరా? ఇంటికి పెద్దవాడివి. సొమ్ము పోతే పోలీస్ రిపోర్ట్ వెంటనే ఇవ్వాలని తెలీదూ?" కోప్పడ్డాను వాణ్ణి.

"నన్నేం చెయ్యమంటావు మామయ్య. అమ్మ పోలీస్ రిపోర్ట్ ఇవ్వద్దని గొడవ చేసి నా కాళ్ళు చేతులు కట్టేసింది"- తల్లి వంక కోపంగా చూస్తూ చెప్పాడు వాడు.

"నువ్వివ్వొద్దన్నావా?" ఆశ్చర్యంగా అడిగాను అక్కయ్యని.

తలవూపింది.

"ఏం?"

సమాధానం చెప్పలేదు.

'బావకి తెలీకుండా ఆ నగలు అక్కయ్య అమ్మేసి ఆ స్థానంలో గిల్టు నగలుంచిందా' అన్న అనుమానం వెంటనే నాకు కలిగింది.

"పోలీసులతో గొడవ ఎందుకనుకుంటున్నావా?" అడిగాను మళ్ళీ.

మళ్ళీ తల అడ్డంగా వూపింది.

"ఆ రమణయ్య గాడు ఎక్కడున్నా పోలీసులు పట్టుకుని మన సొమ్ము మనకిప్పిస్తారు. ఆలస్యం చేస్తే వాడు ఖర్చు చేసేసే ప్రమాదం వుంది!"

"పోతే పోనీ. ఆ సొమ్ము మనది కాదని ఓ ఏడుపు, ఏడ్చి వూరుకుందామనే నిర్ణయించుకున్నాను" చెప్పింది అక్కయ్య.

నా ఆశ్చర్యం రెట్టింపయింది. పోలీసు రిపోర్టు ఇవ్వడం వల్ల లాభమే తప్ప నష్టం వుండదుగా.

"నీ కేమయినా పిచ్చా? పద పోలీస్ స్టేషన్‌కి వెళ్దాం" గట్టిగా చెప్పాను.

అక్కయ్య బాధగా నవ్వి చెప్పింది.

"వద్దురా తమ్ముడూ! నీకు తెలీదు."

"ఏం తెలీదు?"

"రిపోర్టిస్తే రమణయ్యగాడ్ని పోలీసులు పట్టుకుంటారు. ఆ నగలు ఎక్కడ దాచాడో చెప్పమని చితకతంతారు. వాడు చెప్పేదాకా చిత్రహింసలు పెడుతూనే వుంటారు."

"పెట్టనీ. వాడికి తగ్గ శాస్తే అది."

"రోజూ పేపర్లలో చదువుతూనే వున్నాంగా 'పోలీస్ లాకప్‌లో చిత్రహింసల వల్ల మరణం' అన్న వార్తలు. ఒకవేళ... ఒకవేళ రమణయ్య ఎప్పటిలా పెళ్ళాం మీద అలిగి వెళ్ళాడేమో? ఆ దొంగతనం వాడు చెయ్యలేదేమో? అలాంటప్పుడు వాడు పోలీసుల చేతుల్లో పడితే ఇంకేమయినా వుందా? నావల్ల ఓ నిండు ప్రాణం పోవడం నాకిష్టం లేదు. పోలీస్‌లకి రిపోర్టులిచ్చే రోజులు ఎప్పుడో పోయాయి. పాడు డబ్బు పోతే పోనీ" చెప్పింది అక్కయ్య.